# ఎర మింగని చేప

రొదచేసుకుంటు వచ్చి ఆగిన మోటారు సైకిలు చప్పుడూ, దాని వెనువెంటనే "హల్లో డాక్టరో మీనాదేవి గారూ, గుడ్ మార్నింగ్" అంటు చేసిన అభినందనా, ఇవి రెండూ వింటూనే, అంత "బిజీ"లోనూ తల పైకెత్తి చూసింది డాక్టర్ మీనాక్షి.

దాదాపు ఆరడుగుల నిండయిన విగ్రహం. పచ్చని ముఖంమీద సున్నగా నల్లగా గెడ్డం ఆనమాలు. ఖరీదయిన పొన్నూరు ఖద్దరుపంచా, భుజంమీద మడతలు పెట్టిన గోధుమ రంగు ఖద్దరు సిల్కు కండువా – కాళ్లకి హాఫ్ బూట్, కళ్లకి చలవ అద్దాలు – నవ్వుతూ నలభయి ఏళ్ల ఆసామి మెల్లెక్కుతున్నాడు.

"ఎవరీయన చెప్మా, ఎక్కడో చూసినట్టుంది" అనుకుంటుండేలోగానే చటుక్కున జ్ఞాపకంవచ్చి, హాల్లోకి అడుగు పెడుతూన్న అతనితో "హల్లో, రండి రెడ్డిగారూ! అలా కుర్చీలో కూచోండి. ఊఁ, ఎలా వున్నారు మీ మిసెస్?" అంది మీనా.

"ఏవిటి, నేను ఇంకా మీకు జ్ఞాపకం ఉన్నానా? నెల్లాళ్ల క్రితం ఓమారు మీ హాస్పిటల్‌కి వచ్చాను. ఈలోగా మరిచిపోయారేమో–ఎలాగో పరిచయం చేసుకోవటం అంటు ఆలోచిస్తున్నాను ఇంకా నేను."

"నయం. ఎందుకు జ్ఞాపకం లేరూ? నెల్లాళ్ల క్రితం

మీ మిసెస్‌ను పరీక్షించమని తీసుకువచ్చి టానిక్ రాసిస్తే పట్టికెళ్లారు. మీరు మ్యునిసిపల్ ఆఫీసులో...."

"కౌన్సిలరునుఅయితే మీరునన్ను బాగా జ్ఞాపకంపెట్టు కున్నారన్నమాట!" అంటు రెడ్డి నవ్వుతూ కుర్చీలో కూర్చు న్నాడు. ఆ నవ్వులో "నేను బాగా జ్ఞాపకం వున్నానే డాక్టరుకు" అనే గర్వరేఖ ఒకటి క్షణకాలంమెరిసి మాయం అయింది.

"ఏవిటి ఇలా వచ్చారు?" అంది మీనా.

"అబ్బే! మీ రిచ్చిన టానిక్కు మా వాళ్లకు బాగా పడింది. ఇప్పుడు బాగా ఆరోగ్యంగా ఉంది. మళ్లీ తీసుకు వచ్చి చూపించమంటారో ఏమో అడుగుదాం అనీ, మీ ఫీజు ఎంతో తెలుసుకొని ఇచ్చి వెళదాం అనీ వచ్చాను."

"ఫీజు ఇచ్చేటంత నేను ఏం వైద్యం చేశాననీ - ఏం ఇవ్వక్కర్లేదు. ఆరోగ్యంగా ఉంది అన్నారు. అదే ఫీజు"

డాక్టర్ మాటలకి సంతోషంతో ఉక్కిరిబిక్కిరయి కొంతసేపు ఏం మాట్లాడకుండా ఉండిపోయి ఆ తర్వాత "మీ రెంత ఉదార హృదయులండీ! మీ రూపంలాగే హృదయంకూడా ఎంతో సుకుమారం అయింది" అన్నాడు రెడ్డి.

టేబిల్‌మీద ఉన్న పేపర్ వెయిట్ ఇటూ అటూ దొర్లిస్తూ, రెడ్డిమాటలకి సిగ్గుతో బుగ్గలు ఎరుపెక్కి "మరీ అంత పొగడకండి" అంది మీనాదేవి. ముఖానికి మరింత అందాన్నిచ్చిన ఆ సిగ్గులమొగ్గని కళ్ళతోనే తాగుతూ

"నిజం డాక్టర్! ఊళ్ళో ఎవర్ని అడగండి. మిమ్మల్నీ, మీ అందాన్నీ, హస్తవాసినీ అన్నిటికీ మించిన మీ ఆర్ద్ర హృదయాన్నీ ప్రశంసించేవాళ్ళే ప్రతీవాళ్ళూ" అన్నాడు రెడ్డి.

"చాల్లెండి" అంది మరింత కుంచించుకుపోతూ డాక్టర్ మీనాదేవి.

"ఏవిటి? నా మాటంటే నమ్మకం లేదా? పోనీ ఒట్టు వేస్తాను పట్టండి" అంటూ చెయ్యి జాపాడు రెడ్డి.

ఇంతలో డాక్టర్ మీనాదేవి తొట్రుపడుతూ లేచి నిలబడి మరీ గౌరవిస్తోంది "రండి .... రండి" అంది. ఎవర్ని చెప్మా లేచి నిలబడి నేను వచ్చినప్పుడు కూడా లేవ లేదేమే" అనుకుంటూ అప్రయత్నంగా వెనుదిరిగి చూశాడు రెడ్డి.

అయిదున్నర అడుగులలోపు మనిషి. సన్నగా, పీలగా, నల్లగా ఉన్నాడు. రేగిన జుట్టు, లోతుకి పీక్కుపోయిన బుగ్గలూ, సామాన్యమైన రంగు పేంటు, తెల్ల స్లాకూ వేసు కున్నాడు. వయస్సు నలభై లోపు అయినా, సరి అయిన పోషణ, శ్రద్ధా లేక, దాదాపు ఏభై లోపు కనిపిస్తున్నాడు. ముదురు మొహంతో మోటగా ఉన్న ఈ వ్యక్తి ఎవరు? తను ఎప్పుడూ ఈ ఊళ్ళో చూడలేదే! ఓహో, కొత్తగా వచ్చిన ఈ డాక్టరుకి ఎవరేనా కావలసిన వాళ్ళేమో అను కున్నాడు రెడ్డి.

ఆ వచ్చినవ్యక్తి విలాసంగా ఎంతో స్వతంత్రంగా

ఓ కుర్చీ లాక్కుని కూర్చున్నాడు. అతను కూర్చున్నాక
గాని డాక్టర్ మీనాదేవి తన కుర్చీలో కూర్చోలేదు. "ఇదే
విటి డాక్టర్ మీనాదేవిఅంతటిది ఇటువంటి అతి సామాన్యు
డికి ఇంత గౌరవం ఇస్తుందేవిటి?" అనుకుని ఆశ్చర్యపోయాడు
రెడ్డి—అంతకంటే ఎక్కువే ఆశ్చర్యపోయాడు, ఆ తర్వాత
ఆ వచ్చిన వ్యక్తిని తన భర్తగా మీనాదేవి తనకి పరిచయం
చేసినప్పుడు.

మీనాదేవి భర్తను రెడ్డికీ, రెడ్డిని భర్తకూ పరిచయం
చేశాక, మీనా ఆమె భర్త రంగస్వామీ ఏవో మాట్లాడు
కొంటుంటే రెడ్డి తన ఆలోచనల్లో తాను ఉన్నాడు.

కాకి ముక్కుకి దొండపండులా ఇంత అందమైన
మీనాకి ఇంత కురూపి అయిన భర్తేవిటి? కరవున బోసిన
బంగారంలా పచ్చని శరీరచ్ఛాయ, చెంపకి చేరడేసి కళ్లూ,
తీర్చిదిద్దిన అవయవ సౌష్టవంతో, ఎర్రని జరీ అంచు చీరలో
నుదుట కోలగా దిద్దుకున్న తిలకం, చెవులకి కెంపులు పొదిగిన
దుద్దులూ, సుతారంగా చుట్టిన మెలిక సిగా, ఆ సిగలో నవ్వు
తూన్న ఒకే ఒక తెల్లగులాబీ, మెళ్ళో ముత్యాలసరమూ
పిటితో చూడగానే ఇట్టే దిగ్భ్రాంతుల్ని చేసే ఈ పాతిక
సంవత్సరాల సౌందర్యానికి ఈ రంగస్వామా ప్రేమపూజారి?
తనలాంటి ఏ నాగరికుడో ఆక్రమించవలసిన స్థానాన్ని ఈ
రంగస్వామి అన్యాయంగా అధిష్టించాడు. ఇదేదో మీనా
దేవికి ఇష్టం లేకుండా పెద్దవాళ్ళు చేసిన సంబంధంలా ఉంది...
మరయితే ఇతని కంత గౌరవాన్ని ఎందు కిస్తుంది ఆమె?....
ఏమైనా ఇంత సౌందర్యవతిని తా నెక్కడా చూడలేదు.

ఇదంతా సహజ సౌందర్యమేకాని అలంకరణవలన వచ్చినది కాదు. ఇదే అలంకరణ నా భార్యకి చేస్తే ఇంత అందంగా ఉంటుందా? ఒక్కనాటికి ఉండదు. ఏమైనా ఇటువంటి అపురూప లావణ్యవతిని, అందాలరాసిని పొందిన రంగస్వామి నిజంగా అదృష్టవంతుడు.

ఇలా ఆలోచిస్తూ ఆమె అందానికి సూదంటురాళ్ళలా ఆకర్షింపబడ్డ తన చూపుల్ని మరల్చుకోలేక సతమతమౌతున్న రెడ్డి, పక్కనున్న రంగస్వామి లేవడంతో, తనూ లేచాడు. ఆలోచనలనుంచి తేరుకుని "వస్తానండీ! స్టేషనుకి వెళ్ళి ఓ మిత్రుడిని కలుసుకోవాలి...అక్కడనుంచి అవసరమైతే మద్రాసు వెళ్లాలి అతనితో. ఏదో ఇలాగే ఉంటాయి మా బిజినెస్ చేసేవాళ్ళ బ్రతుకులు. ఓ పద్ధతీ, ఓ ప్రోగ్రాం ఏం లేకుండా" అంటు రంగస్వామి బయలుదేరాడు. అతణ్ని గుమ్మందాగా సాగనంపివచ్చి తన కుర్చీలో కూర్చుంది మీనాదేవి.

ఎదురుగుండా కుర్చీలో కదలకుండా, వచ్చినపనేమిటో చెప్పకుండా ఆ మట్టునే కూర్చున్నాడు రెడ్డి. మీనాదేవికి అతను ఉండడం కొంచెం ఇబ్బందిగా ఉంది. "వచ్చిన పనేమిటో పూర్తి చేసుకుని ఎంతసేపటికీ వెళ్ళడేమిటి బాబూ ఈయన!" అంటు మనస్సులో విసుక్కుంది. ఇతర పేషెంట్సుని చూడడం, వాళ్ళకి చీటీలురాసి ఇవ్వడంలో నిమగ్నం అయిపోయినా మధ్యమధ్య రెడ్డివైపు చూస్తూ అతనిని పంకరిస్తూనే ఉంది మీనాదేవి.

ఇంతలో కొంత పేషెంట్సు రద్దీ తగ్గాక, మీనాదేవి

గారూ!" అంటు సంబోధించి అంతటితో ఆగిపోయాడు రెడ్డి. మీనాదేవి "ఏమిటి?" అన్నట్లు అతనికేసి చూసింది అతని స్వరంలో వినిపించిన నూత్న స్పందనానికి చకితురాలయి.

"అబ్బే, మరేం లేదు. మీరు 'ఊఁ!' అంటే చాలు. తక్కినవన్నీ నేను చేసుకుపోతా" అన్నాడు రెడ్డి ఉత్సాహంతో ఆమె కళ్ళల్లోకి చూస్తూ – తను 'ఊఁ!' అనడం ఏమిటి?... అతని ఆంతర్యం ఏమిటి?...మీనాకి చిరాకు వేయసాగింది రెడ్డి ప్రవర్తన చూస్తే. కాని ఊళ్ళో పెద్ద మనిషికదా అని తమాయించుకుని ఊరుకుంది.

కొంచెంసేపాగి రెడ్డి చెప్పడం ప్రారంభించాడు.

ఆమె ఆ ఊరికివచ్చి ఎన్నోరోజులు కాకపోయినా ఈ కొద్దికాలంలోనూ ఎంతో సమర్థురాలైన డాక్టర్ అనే పేరు సంపాదించుకుంది అనీ, పట్నంలో అశేషజనానికీ ఆమెఅంటే అపరిచితమైన గౌరవం అనీ, అంతటి విద్యా వివేకములున్న వ్యక్తిని పట్నంయొక్క ఉజ్వల భవిష్యత్తుకి వినియోగించు కోనకుండా ఊరుకోనడం తగదనీ, అందుకే నలుగురుపెద్దలూ కలసి ఆమెను ఆ వార్డుకి కౌన్సిలర్‌గా నిలబెట్టడానికి నిర్ణయించుకున్నారనీ, వీలయితేఆమెను ఛైర్మన్‌కూడా చెయ్యాలనీ వాళ్ళు అనుకుంటున్నారనీ ఈ విషయంఅంతా నచ్చచెప్పి ఒప్పించడానికే తనని వాళ్ళు పంపించారని చెప్పి ఆగాడు రెడ్డి.

అతని మాటలు వింటుంటే మీనాదేవికి ఆనందంతో ఒళ్ళు తెలియటంలేదు. నిజంగానా?...తను కౌన్సిలర్ అవు

తుందా? ఆ తర్వాత చైర్మన్ కూడానా?...ఇంత మహా పట్నానికి...హృదయంలోంచి పెల్లుబికి వస్తూన్న సంతోషాన్ని అతికష్టంమీద ఆపుచేసుకుంటూ "ఈ రాజకీయాలూ పదవులూ, ఇవన్నీ నా కెందుకండీ?....ఇందులో పడ్డానంటే ప్రాక్టీసు దెబ్బతింటుంది" అంది.

"అలా ఎందుకు కావాలి. మీ ప్రాక్టీసు దెబ్బతినక్కర్లేదు. అసలు మీరు హాస్పటల్ వదిలి రానక్కర్లేదు. తక్కినదంతా నేను చూసుకుంటాను. మీ అంగీకారంమాత్రం తెలపండి. అది చాలు."

"ప్రాక్టీసుగురించి ఆలోచన ఒక్కటే కాదనుకోండి కారణం. ఇంతమంది విద్యాధికులూ, పెద్దలూ ఈ ఊళ్ళో వుండగా నేను కౌన్సిలర్‌గా నిలబడడం ఏవిటి?" అంది మీనా టేబిల్‌మీదవున్న పేపర్‌వైట్‌ను ఇటూఅటూ దొర్లిస్తూ. అదేవిటంటే!...వేరే ఎవరో అంటారు మీరు విద్యాధికులు కాదా - ఇక పెద్దలంటారూ?...మీరూ ఒకమాటు కౌన్సిలర్ అయితే మాలాగే పెద్దల లిస్టులోకి మీరూ ఎక్కుతారు" అన్నాడు రెడ్డి. ఇద్దరూ నవ్వుకున్నారు.

కాగితంమీద పెన్నుతో ఏవో పిచ్చిగీతలు గీస్తూ "అది సరే అనుకోండి...కాని...అంది" మీనాదేవి.

"ఏవిట సందేహిస్తారు?"

"అహా! ఇందుకు మావారు ఏమంటారో. ఆయన సలహా తీసుకోందే నేను మీకు ఎట్టి సమాధానం ఇయ్యలేను."

"అదేవిటండీ!...విద్యాధికులయిన స్త్రీ మీరు. మీరు కూడా సామాన్య స్త్రీ లాగా భర్త అనుజ్ఞకోసం వేచి ఉండాలా. ఈ మాత్రం స్వతంత్రమైన నిర్ణయం మీరు తీసుకోలేరూ? అందులో ఇది మీ స్వంత విషయం. పైగా మీ అంతటి వ్యక్తికి ఇంకొకరి సలహా కావాలా?...అందులో ఆయనది?"

"రెడ్డిగారూ! ఆ విషయంమీద మీరింక మాట్లాడకండి. మీరన్నట్లు పూర్తిగా అది నా స్వంత విషయం. ముఖ్యమైన ఏ నిర్ణయంకూడా ఆయన సలహా లేనిదే తీసుకోవడం నాకు అలవాటులేదు. ఇందులోనూ అంతే. ఆయనతో సంప్రదిస్తేనే గాని నేను కౌన్సిలర్‌గా నిలబడేదీ లేనిదీ మీకు నేను చెప్పలేను."

మీనాదేవి కంఠంలోని తీవ్రతకి తెల్లబోయి వెంటనే సర్దుకుంటూ "పోనీ అలాగే కానివ్వండి. మీ అంగీకారాన్ని ఆ తర్వాతే తెలియపరచండి.ఇంతలో పోయిందేముంది? వస్తా" అని లేచాడు రెడ్డి.

మోటార్ సైకిలు వెళ్ళిపోయిన చప్పుడు మీనాదేవి చెవులికి ఎంతో సుఖంగా వినిపించి, ఏదో పెద్ద బరువు తీరినట్టు 'హమ్మయ్య' అంటూ దీర్ఘంగా శ్వాస వదిలి కుర్చీలోంచి లేచింది.

రాత్రి భోజనాలు అయ్యాక ఆకులికి సున్నంరాసి చిలకలుచుట్టిఅందిస్తూ "ఈ చిన్నవిషయానికి మీరుఎందుకు ఒప్పు

కోవడంలేదో నాకు ఆశ్చర్యంగా ఉంది" అంది మీనా రంగ స్వామితో.

రంగస్వామి నవ్వుతూ "నాకు అదే ఆశ్చర్యంగా ఉంది. ఈ చిన్నదానికోసం నువ్వు ఎందుకింత పట్టుదల పడు తున్నావో" అన్నాడు.

"అదికాదండీ! అన్ని విషయాలూ అతనే చూసు కుంటాను అంటున్నాడుగదా ఆ రెడ్డిగారు! ఒక్క మీటింగు రోజున, ఎలక్షన్ రోజున, ఉంటే చాలుట – అందువల్ల మనం పడే శ్రమకాని మనకు వచ్చే నష్టంకాని ఏమీ ఉండదు. పైగా సంఘంలో కొంత హోదా పెరుగుతుంది. కొంత కాల క్షేపమూ అవుతుంది."

"ఇప్పుడీ ప్రాక్టీసుతో కాలక్షేపానికి లోటేంవచ్చిందో"

"లోటని కాదండీ! ఇంటిపట్టున ఉండకుండా మీరు ఆ నరసని బిజినెస్‌లో తిరుగుతూంటే నాకు తోచడం లేదండీ అంటే కాపరానికి వచ్చిన కొత్తలో నన్ను మెట్రిక్‌కి కట్టిం చారా! ఊళ్ళోనే ఆడపిల్లల కాలేజీ ఉంది సరదాగా చదు వుతే ఏం పోయిందని పి. యు. సి. లో చేర్పించారా! ఫస్టు క్లాసు వచ్చిందని నాకు తెలియకుండానే మెడిసన్‌కి అప్లికేషన్ ఫారమ్ తెప్పించి, అయిదేళ్లు ఎంతలో తిరిగివస్తాయి మధ్యలో నేను వచ్చి చూస్తూ ఉంటానుకదా అంటూ నచ్చచెప్పి ఒప్పించి డాక్టరీ పేస్ చేయించి, నీ ప్రాక్టీసుకి వీలుగా ఉం టుందంటూ ఈ ఊరు తీసుకువచ్చి మీ బిజినెస్ కూడా ఈ ఊరికి మార్చుకుని నా అభివృద్ధికి ఇంతగా దోహదం చేశారే–

అటువంటిది కౌన్సిలర్ విషయంలో మీ రెందుకింత విముఖత చూపిస్తున్నారో నాకర్థం కావడంలేదు.

"అదికాదు మీనా!"

"నేను మీరు చెప్పింది ఏది కాదన్నాను! మీరు కాదన్నది ఏం చేస్తానన్నాను? ఈ ఒక్క విషయంలోనూ పోనీ అది ఏదో సరదాపడుతోందని మీరు ఎందుకుఅంగీకరించ కూడదా అని నాకు పట్టుకున్నది..."

"నీకు నిజంగా అంత సరదాగా ఉంటే అలాగే కానియ్యి. నేను ఎందుకన్నానంటే ఈ రాజకీయాలున్నాయి చూశావు. ఇందులో స్త్రీలు ప్రవేశించడం అంత శ్రేయ స్కరం కాదు. ఒకవేళ ప్రవేశించినా కొన్ని నియమ నిబంధనలు సడలించి ఎప్పుడూ తను నవ్వుతూ ఇతరుల్ని నవ్విస్తూ ఉండాలి. అది నీ వల్లకాదని నాకు తెలుసు. అందుకే వద్దన్నాను."

"మీది మరీ విచిత్రమండీ! అంత ఏం ఉండదు"

"సరే కానియ్యి"

ఇన్నాళ్ళకి స్వతంత్రించి తనో పని చేయగలుగు తున్నానుకదా, అందు కాయనని ఒప్పించగలిగాను కూడా కదా అని ఎంతో ఆనందించింది మీనాక్షి.

అనుకున్న ప్రకారం మీనాదేవి ఆ వార్డుకి కౌన్సిలర్‌గా ఎన్నిక అయింది. ఫలితాలు తెలిసిన రోజున మధ్య హాల్లో కూచుని ముగ్గురూ కాఫీలు తీసుకుంటూ ఉండగా

"మొత్తంమీద మీరు అసాధ్యులండీ? మీనాక్షిని నెగ్గించి అన్న మాట నిలబెట్టుకున్నారు" అన్నాడు రంగస్వామి

"నేను నెగ్గానండే ఈ ఘనత అంతా రెడ్డిగారదే. నా కోసం ఎంత శ్రమపడ్డారు ఆయన. నిజానికి ఈ విజయం ఆయనది" అంది మీనా కృతజ్ఞతా సూచకంగా రెడ్డివైపు చూస్తూ.

"ఆఁ! ఇందులో నేను చేసింది ఏం ఉంది అండీ! ఆ పదవికి మీకు అర్హత ఉంది. మీరు నెగ్గారు. సంఘంలో గౌరవం ఉన్నవాళ్ళు పదవులు అలంకరించడం కంటే అందం ఏం ఉంది?" అంటూ కాఫీ కప్పు టీపాయ్‌మీద పెట్టి, సిగరెట్టు నోట్లోపెట్టి అగ్గిపెట్టికోసం జేబులు తడుముకోసాగాడు రెడ్డి.

అతనికి అగ్గిపెట్టె అందిస్తూ "పదవులు అలంకరించాక అంత క్రితం సంఘంలో ఉన్న గౌరవాన్ని పోకుండా నిలబెట్టుకోవడం ఓ సమస్యకదా?" అన్నాడు రంగస్వామి అదోలా చూస్తూ.

"అలా ఎందుకు జరుగుతుందండీ!" అన్నాడు రెడ్డి గాలిలోకి ఉంగరాలు ఉంగరాలుగా పొగ వదులుతూ.

"ఊ – ఇంతవరకూ బాగానే జరిగింది" అంది మీనా.

"ఇక ముందు ఇంతకంటే బాగుంటుంది. ఎల్లుండే మన కౌన్సిలర్లు మీటింగూ టీ పార్టీను. బహుశా ఆ పార్టీలోనే మిమ్మల్ని ఛైర్మన్‌గా ఎన్నుకోవడంకూడా జరగవచ్చు.

అందుకు కావలసిన ప్రయత్నాలన్నీ నేను ఇంతి క్రితమే చేసిఉంచాను లెండి” అన్నాడు రెడ్డి.

“మీరింత నిస్వార్థంగా నా కోసం శ్రమపడుతూంటే ఏ విధంగా కృతజ్ఞత చెప్పుకోవాలో అర్థం కావడం లేదు” అంది మీనాక్షి.

“ఆ, దానికేం లెండి - మీరు ఎల్లుండి పార్టీకి మూడు గంటలకల్లా రెడీగా ఉండండి” అన్నాడు రెడ్డి.

“మీకు కూడా రండి పార్టీకి” అంది మీనా.

“మధ్య నే నెందుకు?” అన్నాడు రంగస్వామి.

మీనాక్షి బతిమాలసాగింది.

“ఆవిడ అంతగా అడుగుతున్నప్పుడు పోనీ రాకూడదూ”

“నా కెక్కడ కుదురుతుందండీ!....పైగా నే నివాళే బిజినెస్ పనిమీద బొంబాయి వెళుతున్నాను. రిజర్వేషను కూడా వచ్చేసింది.” అన్నాడు రంగస్వామి.

“సరే మీ ఇష్టం. నేను వస్తాను మీనాదేవీ. ఎల్లుండి మూడు గంటలకల్లా మీరు రెడీగా ఉండండి. నేను కారు తీసుకుని వస్తాను. అదే, మా మిసెస్‌నికూడా తీసుకువస్తాను లెండి. మీకు కొంత కాలక్షేపంగానూ సాయంగానూ కూడా ఉంటుంది. మరి నేను వస్తా” అంటూ వెళ్ళిపోయాడు రెడ్డి.

అతణ్ని గేటుదాకా సాగనంపి వచ్చి “రెడ్డి చాలా మంచివాడండీ!” అంది మీనాక్షి.

"ఊ - మొన్న నేదో సీరియస్ ఆపరేషను చేశావు. ఇపుడెలా ఉంది పేషెంటుకి?" అంటూ మాటమార్చాడు రంగస్వామి.

మీనాక్షికి మనస్సు చివుక్కుమంది.

మొన్నటికి మొన్నా అంతే. "రెడ్డికి వీసమెత్తుఅయినా స్వార్థంలేదండీ. నన్ను ఛైర్మన్ చెయ్యాలని చూస్తారేమిటి. మీరే ఛైర్మన్ కావచ్చుకదా అంటే, అదికాదు అటువంటి స్థానాల్లో మీ వంటివారు ఉంటే వచ్చే అందం వేరు అంటూ ఏక పట్టుబడుతున్నాడు" అని చెబితే, తను చెబుతూన్న దేమీ పట్టించుకోకుండా వినీ విననట్లు తన వైపు కాగితా లేవో సరిచేసుకుంటూ కూర్చున్నారు.

ఇలా ఉంటున్నా రేవిటి? ఎందుకంత కోపం? తను వద్దు అంటున్నా వినిపించుకోకుండా కౌన్సిలర్ అయ్యాననా? నాకూ కొన్ని సరదాలు ఉంటాయనీ, నాకూ కొన్ని కోరి కలు ఉంటాయనీ, కేవలం తన అభిప్రాయాల ప్రకారమే నడుచుకోడానికి నేనేం ఆటబొమ్మని కాదనీ అర్థం చేసు కోరేం?

ఈ మాత్రం దానికి ఏదో ఇంట్లో కాలక్షేపం చేస్తూన్న తనని చదివించడం ఎందుకు? డాక్టరుని చెయ్యడం ఎందుకు?తనకీస్థానాన్ని సంఘంలోసంపాదించిపెట్టడం ఎందుకు. తీరా తనకి ఉత్సాహంవచ్చి ఏదో సంతోషంగా ఉండబోతే తన ఉత్సాహంమీద నీళ్ళుజల్లి, తనేదో తలవంపులు తెచ్చే కానిపనేదో చేస్తున్నట్లు వెటకారంగా మాట్లాడడం, కావా

లని నిర్లక్ష్యంచెయ్యడం, ఎందుకు?...తను రెడ్డితో మాట్లాడు తున్నప్పుడు మొహం అంత చికాకుగా పెట్టడం దేనికి?... ఇష్టం లేకపోతే "మీనా, వద్దు" అని చెప్పవచ్చుకదా. ఇం తకీ తనకి ఇష్టంలేని పని ఎప్పుడు చేశాను, ఏం చేశాను?

ఇలా అనుకుని కళ్ళల్లో నీళ్ళు తిరిగి అటు చూసింది. రంగస్వామి అప్పటికే కుర్చీలోంచి లేచి వెళ్ళిపోయాడు. బొంబాయి ప్రయాణానికి సిద్ధం అయిపోయి డ్రైవర్ని గేరేజీ లోంచి కారు తియ్యమంటున్నాడు.

"మీకు ఇష్టంలేకపోతే కౌన్సిలర్ పోస్టుకి రిజైన్ చేస్తానులెండి" అని గబగబా ఒక వాక్యం కాగితంమీదరాసి, ఆ కాగితం చీటీగా మడిచి వేనిటీబేగ్‌లో పెట్టుకొని గేరేజ్ దగ్గరికి తొందరగా అడుగు కదిపింది మీనాక్షి.

డ్రైవర్ని వద్దని తనే స్టీరింగు దగ్గర కూచుంది మీనాక్షి. రంగస్వామి ఇంక వెళ్ళు అంటున్నా వినిపించు కోకుండా ట్రైన్ వచ్చేదాకా ఆగింది. ట్రైన్ కదిలేదాకా ప్లాట్‌ఫారమ్‌మీద నిలబడి తనేదో చెబుతూంటే ఆయనేం వినిపించుకోకుండా పేపర్లో తలదూర్చి కూర్చున్నారు. గార్డ్ విజిల్ వెయ్యగానే తన బేగ్‌లోంచి చీటీతీసి ఆయన జేబులో పెట్టి ట్రైన్‌లో వెళుతూన్న ఆయనకి నవ్వుతూ చెయ్యి ఊపింది. కాని రంగస్వామి జవాబుగా చెయ్యి ఊపలేదు. ట్రైన్ కనిపించినంత దూరం అలాగే చూస్తూ ప్లాట్‌ఫారమ్ మీద నిలబడిపోయి ఆ తర్వాత బరువైన హృదయంతో దీర్ఘంగా శ్వాసవదిలి వచ్చి కార్లో కూర్చుంది మీనాదేవి.

అనుకున్న రోజు సాయంత్రం మూడు అయేసరికల్లా కారు డ్రైవ్ చేసుకొని మీనాక్షి ఇంటికి వచ్చాడు. 'ఒక్కరే వచ్చారేం?' అన్న ప్రశ్నకి సమాధానంగా 'నా మిసెస్‌కి తల నెప్పిగా ఉందిట అందుకు రాలేదు' అని చెప్పాడు. "తీసుకు రాపోయారా మందు ఇద్దును" అంది మీనా. "ఈ టైములో కూడా మీకు కాస్త విశ్రాంతి లేకుండా మందులు ఇవ్వడం ఏవిటి పోనిద్దురూ" అన్నాడు రెడ్డి.

రెడ్డి తొందర చెయ్యసాగాక లేచి ముఖం రుద్దుకుని బట్టలు వేసుకుని రెడీ అయింది మీనాక్షి. కారు తియ్య బోతూంటే 'ఇద్దరం ఒకచోటికే వెళ్ళబోతూంటే మళ్ళా మీకు వేరే కారు ఎందుకు నా కారులో రండి' అన్నాడు రెడ్డి. పోనీ డ్రైవర్నైనా తీసుకువెళదాం అంటే అక్కర్లే దన్నాడు. మరీ అంతగా చెబుతూన్నప్పుడు కాదుకూడదంటే బాగుండదని వెళ్ళి అతని కార్లో వెనకసీటులో కూర్చో బోయింది మీనాక్షి. 'ఇలా ముందుకు రండి' అంటూ ముందు డోర్ తెరిచాడు రెడ్డి. కొంచెంసేపు తటపటాయించి తిరిగి ఇంట్లోకి వెళ్ళి వంటమనిషికి పనులు పురమాయించి, వాన వస్తే కిటికీ తలుపులు వెయ్యమని నౌఖరుకి చెప్పి, తోట మాలికి కావలసిన హెచ్చరికలు చేసి వచ్చి రెడ్డిపక్క ముందు సీట్లో ముడిచిపెట్టుకుని ఇబ్బందిగా కూర్చుంది.

రెడ్డి నెమ్మదిగా డ్రైవ్ చేస్తున్నాడు.

"ఎంత చదువుకున్నా ఏం ఉద్యోగంచేసినా ఆడదానికి గృహనిర్వహణ బాధ్యతలూ ఇల్లాలుగా నిర్వహించవలసిన

కొన్ని ముఖ్యమైన పనులూ తప్పవు. పైగా మీలాంటివారి మాట తీసెయ్యలేక మీటింగులూ విందులూ గోవిందులు కూడా చూసుకోవాలి” అంది నవ్వుతూ మీనాదేవి.

“ఏమిటండోయ్! మొత్తంమీద మాకు గోవిందులు పెట్టేస్తున్నారు” అన్నాడు రెడ్డి నవ్వుతూ.

ఆమె నవ్వి “అబ్బే. ఏదో యథాలాపంగా అన్నది లెండి” అంది.

“ఆ రోజున మీ ముభావం, మీవారి ముఖభంగిమా చూస్తే మీకు ఇష్టంలేదేమో, మీరు కౌన్సిలర్ కావడం మీ వారికి ఇష్టంలేదేమో అని భయపడ్డాను సుమా అండి” అన్నాడు రెడ్డి ఓరగంటితో మీనాక్షిని చూస్తూ.

మీనా తల ఒంచుకొని చేతినున్న బంగారపు గాజులు తీస్తూ తొడుగుతూ “నిజానికి మా వారికి ఇపుడూ ఇష్టంలేదు. నాకే సరదాగా ఉండి ఆయనని బలవంతంగా ఒప్పించాను. మా దాంపత్య జీవితంలో ఆయనకి ఇష్టంలేని పని నేను చెయ్యడం ఇదే మొదటిది” అంది.

రెడ్డి పరిశీలనగా ఆమె ముఖంకేసి చూశాడు.

“కొత్తలో మిమ్మల్ని చూస్తే ఇలా సరదాగా ఉంటా రనుకోలేదు” అన్నాడు రెడ్డి.

“అప్పుడేదండీ! మీరు కొత్తకదా! మీ రెలాంటి వారో తెలియదూ”

"పోనీ ఇప్పుడు తెలిసిందా నేను ఎలాంటివాణ్ణో!"

"భలేవారండీ!" కిలకిలా నవ్వింది మీనా.

ఊరుదాటి తారు రోడ్డు మీంచి మెత్తగా జారి పోతోంది కారు. కారు స్లిడ్‌లోంచి చల్లనిగాలివచ్చి చెంపల్ని ముద్దెట్టుకుని ముంగురుల్ని సవరించి అతిప్రియమైన వ్యక్తిలాగ హాయిని కలిగిస్తోంది. పరధ్యానంగా ఏదో ఆలోచిస్తూ కారు డోర్ మీద చెయ్యి వేసుకుని ఆకాశంవైపు చూస్తూన్న మీనాక్షీ, కారు ఊరుదాటివచ్చేస్తోందన్న సంగతినే గ్రహించలేకపోయింది.

ఆకాశంలో చిన్నచిన్న మేఘాలన్నీ ఒక్కచోటికి జేరుకొని పెద్దపెద్ద నల్లని రాక్షసులులా రూపుకడుతున్నాయి. వాటిని చూస్తూంటే మీనాకి చిన్నప్పటి తన భయాలు గుర్తుకు రాసాగాయి. వేసంకాలంలో అమ్మపక్కని పెరట్లో పడుకున్నప్పుడు, ఓ రాత్రివేళ మెళకువవస్తే, మదురుగోడ దగ్గరున్న జామిచెట్టు నల్లని రాక్షసుడిలాగా, గాలికి ఊగే కాయలు ఆ రాక్షసుడి చెవులికి ఉండే కుండనాల్లాగా అని పించి భయంతో అమ్మనిలేపి కూర్చోపెట్టేది. చిన్నచప్పుడు విన్నా దొంగాడు కన్నం తవ్వుతున్నాడు అనుకోవడం, కీనీడలో ఉన్న ప్రతి తడపనీ పాము అనుకోవడం - అవన్నీ ఇప్పుడు తలచుకుంటే నవ్వు వస్తుంది.

"వాన వచ్చేలాగ ఉందండీ" అంది రెడ్డితో.

"రానీండి మనకేం భయం" అన్నాడు నిశ్చలంగా రెడ్డి.

ఇంతలో చిలక ఒకటి "కయ్! కయ్!" మంటూ అరిచి, జామిచెట్టుని ఉన్న పండుని ముక్కుతో పట్టుకుని పండుతో సహా ఎగిరిపోవాలని ప్రయత్నం చేసింది. కాని పాపం దాని ప్రయత్నం ఫలించలేదు. ఫలం జారిపోయింది. అది చూచి మీనా నవ్వుకుని "ఈ చుట్టూ జామితోటలు ఎక్కువ కాబోలు" అంది రెడ్డితో.

రెడ్డి పరధ్యానంగా "ఊఁ!" అన్నాడు.

ఇంతలో సన్నని తుంపర పడసాగింది. మీనా గ్లాస్ డోర్ వెయ్యబోతే బెట్టుగా ఉండి అది పడలేదు. దాంతో ఓ చేత్తో స్టీరింగ్ నడుపుతూనే రెడ్డి ఆమెమీదకి ఒంగి డోర్ వేసే వంకతో ఆమెని కావాలని తగిలాడు. మీనా ఇంకా ఒదిగి కూర్చుంది.

"మనం పూరుదాటి వచ్చేశామేమో" అంది మీనాక్షి. అవును. అదిగో పూరుబయట అక్కడ కన్పిస్తూన్న మ్యునిసిపల్ ట్రావెలర్స్ బంగాళాలోనే పార్టీ—మనం ఇప్పుడు అక్కడికే వెళ్లాలి" అన్నాడు రెడ్డి—కొంచెంసేపు పూరుకొని "మీవారు ఎంతవరకు చదువుకున్నారు?" అని ప్రశ్నించాడు రెడ్డి.

"ఆయనకి చదువు ఎందుకండి."

"అంటే?"

"డిగ్రీ అంటే లేదుకాని ఆయనకి రాని భాష అంటూ లేదు. తెలియని సంగతంటూ లేదు. సంసార బాధ్యత బిజి

నెస్ వ్యవహారాలూ చిన్నప్పుడే మీదపడి ఆయనని చదువు కోకుండా చేశాయి. అందుకే నువ్వేనా చదువుకో అని బల వంతంగా నన్ను చదివించారు."

"అయితే అందంలోనే కాకుండా చదువులోకూడా ఆయన మీకంటే తక్కువే అన్నమాట!... నేననుకున్నాను లెండి. ఇదేదో పెద్దవాళ్ళు బలవంతంగా చేసిన పెళ్ళికాని మీకు ఇష్టమై చేసుకున్నది కాదని."

"కాదండీ!...నాకు ఇష్టమయే చేసుకున్నా."

రెడ్డి నవ్వి "ఆడవాళ్ళంతా ఇంతేలెండి - తప్పనిదాన్ని ఆనందంగా స్వీకరిస్తారు. నిజానికి మీకు చాలా అన్యాయం జరిగింది. మీలాంటి అందమైన విద్యాధికురాలికి అనుకూలు డైన భర్త కాకపోవడం విచారకరమే!...లోకంలో ఇలాగే జరుగుతాయి. ఇప్పుడు నాకు చూడండి - ఆమె కాకుండా ఏ మీలాంటి అందగత్తో నా భార్య అయితే పువ్వుల్లోపెట్టి పూజించకపోదునా?" అంటూ ఓరగా చూశాడు మాధవి కేసి.

మీనా ఆ మాటలకి కళవళపడి ఏదో చెప్ప బోయింది. కాని కంఠం పూడుకుపోయి మాట బైటికి రాలేదు.

ఆమె మౌనాన్ని అంగీకారంగా భావించి "మీనా ఈ రోజు మన జీవితంలో ఎంతో మధురమైంది. ఈ చల్లని సమయంలో ఏకాంతంగా ఎగిరిపోతున్న మన మిద్దరం -

ఇద్దరం విద్యా రూపాల్లో సమానమైన స్థాయి కలవాళ్ళం. ఈ మధుర క్షణంకోసం నిన్ను చూసిన మొదటి రోజునుంచీ ఎంత కాంక్షతో వేచివున్నానో-" అన్నాడు ఉద్రేకంతో రెడ్డి.

మీనా ముఖం అంతా కోపంతో ఎర్ర మందా రంలా జేవురించి "ఇదా నీ ఆలోచన? .... ఇందుకా నన్నీ ఎలక్షన్లలుఅంటూ దింపింది-చాలు నీ అసలురూపం తెలియక మోసపోయాను. ఆయన అంటూంటే అర్థం చేసుకోలేక పోయాను. ఆపు-కారు ఆపు" అంటూ గర్జించింది.

రెడ్డి అంతలోనే సర్దుకుంటూ "మీనాదేవిగారూ!.... ఇంత మాత్రానికే అంతకోప పడడం దేనికి? నా మన స్సులో ఉన్న దేదో చెప్పాను-ఇష్టం అయితే ఒప్పుకోవచ్చు - లేదా నా కిష్టం లేదనవచ్చు - ఇంత మాత్రానికే అంత అల్లరి దేనికి?" అన్నాడు తాపీగా.

"ఛీ! తుచ్ఛుడా! .... నీలాంటి దొంగ త్రాచు లీ సంఘంలో ఉండడం మూలానే నాలాంటి స్త్రీలు చొరవగా సమాజం మధ్యలోకి రాలేకపోతున్నారు - ఆడదాని శీలాన్ని ఎంత తేలికగా జమకట్టావు! మారే కాలంతో మారలేని నాలాంటి పిరికిపందలు కాదు. ధైర్యవంతులయిన యువతులు తమ కాలి చెప్పులతో, లోకం మారుతున్నా బుద్ధులు మారకుండా వున్న నీలాంటి గుంటనక్కలకి బుద్ధి చెప్తారు. అయినా వాళ్ళదాకా ఎందుకు? ఆ బుద్ధి నేనే చెప్తాను. కారు

ఆపు చెయ్యక పోయావంటే" అంటూ ఉరుము ఉరిమినట్లు అరిచింది మీనాక్షి.

అప్రతిభుడై కారు ఆపుచేశాడు రెడ్డి.

విసురుగా డోర్ తీసుకుని దిగి, ఆ దారిన వెళుతూన్న రిక్షాని పిలిచి అందులో ఎక్కి వెనక్కి పోనిమ్మని, భర్త హెచ్చరికనీ, భర్తకి తాను చీటీద్వారా ఇచ్చిన హామీని తలుచుకుని అవమానంతోనూ సంతృప్తితోనూ కూడిన మిశ్రమ భావాలతో వెళ్ళిపోయింది మీనాక్షి. వెళ్ళిపోతున్న మీనా వేపే చూస్తూ నిట్టూర్చాడు రెడ్డి. ఎరని తప్పించుకొని ఎగిరి నీటిలోపడి పారిపోతూన్న అందమైన చేపకేసి నిస్సహాయంగా చూసే జాలరిలాగ బాధగా బరువుగా—

—సమాప్తం—